## క్లుప్తంగా...

### నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల కొమ్మల నరికివేత కారణంగా మేడ్చల్ పట్టణంలోని పలు కాలనీల్లో శనివారం కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఏకలవ్యనగర్, వీకర్‌సెక్షన్‌కాలనీ, ఎస్‌వీఆర్ కాలనీ, జ్యోతినగర్, హరిజనవాడ, స్టేషన్‌రోడ్డు, జ్యోతినగర్, ఎయిర్ ఫోర్స్‌కాలనీ, సరస్వతినగర్, సాయిబాబా కాలనీ, మెట్రోల్యాండ్ మార్క్, ఎల్లమ్మతోట, గిర్మాపూర్ రోడ్డులో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

### మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని 23 వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులకు మున్సిపాలిటీ నుంచి కేటాయించే బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సమావేశం నిర్వహించగా కౌన్సిలర్లు బడ్జెట్‌కు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సంవత్సరంలో రూ.159.80 లక్షలతో చేపట్టే పనులకు ఆమోదం తెలిపారు. అజెండాలో 38అంశాలు చేర్చి వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహరెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు 20మంది కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

### ఆద్రాస్‌పల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఆద్రాస్‌పల్లిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం ఆద్రాస్‌పల్లి గ్రామాన్ని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి దత్తత తీసుకున్నాడు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లలిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం జవహర్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొయ్యడ వెంకటేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ నాయకులు క్లోపల్లి సదానంద్ మాదిగ, జిల్లా కో–కన్వీనర్ వడ్డేపల్లి శివకుమార్ మాదిగ హాజరై జెండావిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బిర్రు యాకస్వామి, ఆనందాస్ ప్రకాష్, నగునూరి ప్రభాకర్, మొగలిపాక పరుశురాములు, వెంకటేష్, శ్రీను, క్రాంతికుమార్, శివకుమార్, ఆంజనేయులు, ఐలయ్య, లక్ష్మయ్య, శ్రీను, నరేందర్, రాజు, నిఖిల్, ఉపేందర్, బాబు, సాయప్ప, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

### యువత క్రీడల్లో రాణించాలి



మేడ్చల్‌రూరల్: యువత క్రీడల్లో రాణించాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైసమ్మగూడ చెందిన సుంకరి వంశీకృష్ణ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు క్రికెట్ టోర్నీ నిర్వహించారు. విజేతగా నిలిచిన గుండ్లపోచంపల్లి జట్టు, రన్నరప్‌గా నిలిచిన మైసమ్మగూడ జట్టుకు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బహుమతులను అందజేశారు. తల్లిదండ్రులు సునీత, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దుర్గేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### లైన్‌మెన్‌పై గరం గరం..

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలో కరెంట్ సమస్యలపై శుక్రవారం గ్రామస్తులు స్థానిక లైన్‌మెన్ జయరాంను నిలదీశారు. నిత్యం అకారణంగా, ముందస్తు సమాచారం లేకుండా కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నారని, రాత్రిళ్లు కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ సమస్యపై ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. గ్రామానికి లైన్‌మెన్‌గా ఉండికూడా ఎందుకు అందుబాటులో ఉండటం లేదన్నారు. గ్రామ ఉపసర్పంచ్ వెంకటేశ్, వార్డు సభ్యులు శశికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వానా కాలం.. రోగాలపై సమరం

**వ్యాధుల నివారణకు ర్యాపిడ్ యాక్షన్ బృందాలు**

- సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు
- డెంగీ, మలేరియా వ్యాధులను అరికట్టేందుకు చర్యలు
- గత అనుభవాల నేపథ్యంలో హైరిస్క్ ఏరియాల్లో వైద్య శిబిరాలు
- అప్రమత్తంగా ఉన్నాం.. డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్





సాక్షి, మేడ్చల్ జిల్లా: వానాకాలంలో వాతావరణంలో మార్పుల కారణంగా ప్రబలే వ్యాధులపై సమరానికి జిల్లా వైద్యారోగ్యశాఖ సిద్ధమవుతోంది. సీజనల్ వ్యాధుల నివారణకు ర్యాపిడ్ యాక్షన్ బృందాలను రంగంలోకి దింపేందుకు చర్యలు తీసుకుంటోంది. పారిశుద్ధ్యం లోపం వల్ల ధరికి చేరే వ్యాధులను అరికట్టేందుకు ముందు జాగ్రత్తలు పాటించకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక బృందాలను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇప్పటికే దోమలు వృద్ధి చెందకుండా ప్రతి పీహెచ్‌సీ పరిధిలో రసాయనాలను పిచికారీ చేస్తున్నారు. మరోవైపు ఐదేళ్లలోపు చిన్నారులు అతిసారం బారిన పడకుండా ఉచితంగా ఓఆర్ఎస్, జింక్ గోలీలను అందుబాటులో ఉంచారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు దాదాపు రెండు లక్షల లోపు ఉంటారని అంచనా వేస్తున్నారు. వీరికి మందుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా వైద్యశాఖ ప్రారంభించింది.

**ప్రభుత్వ ఆసుపత్రులిలా..**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఒక ఏరియా ఆసుపత్రితో పాటు మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 100 బస్తీ దవాఖానాలు, 47 పల్లె దవాఖానాలు, 12 పీహెచ్‌సీలు, 24 ఆరోగ్య ఉప కేంద్రాలు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

2021తో పోలిస్తే.. గతేడాది జిల్లాలో డెంగీ కేసులు తగ్గాయి. 2022లో 67 డెంగీ, 21 చికెన్‌గున్యా, నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఇందులో మల్కాజిగిరి పీహెచ్‌సీ పరిధిలో 14, ఉప్పల్‌లో 8 డెంగీ కేసులు నమోదు కాగా, కీసరలో 5, కుషాయిగూడ 6, నారపల్లిలో ఒకటి, బోడుప్పల్‌లో 3, మేడ్చల్‌లో 4, జవహర్‌నగర్‌లో 2, బాలానగర్ ఒకటి, కూకట్పల్లిలో 7, కుత్బుల్లాపూర్‌లో 2, అల్వాల్ పరిధిలో 14 డెంగీ కేసులు నమోదయ్యాయి. అదేస్థాయిలో చికెన్‌గున్యా, మలేరియా కేసులూ నమోదయ్యాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో నమోదైన డెంగీ, చికెన్ గున్యా, మలేరియా తదితర కేసులను పరిగణనలోకి తీసుకుంటే.. ఆ సంఖ్య డబుల్‌కు చేరినట్లు తెలుస్తోంది.

**వ్యాధులకు కారణాలివే..**

జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంతో పాటు కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లలోని బస్తీలతోపాటు పురపాలక పట్టణాల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. బస్తీల్లో అభివృద్ధి పర్యవేక్షణ కమిషనర్లదే.. అయినప్పటికీ.. పట్టించుకోవడం లేదు. గ్రామికవాడల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం, కాలుష్యం, మురుగు కాలువలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రైవేట్ ప్లాట్లలో పెరిగిన చెట్లు, ముళ్ల పొదల్లో వ్యర్థ పదార్థాలు చేరడంతో దోమల బాధ భరించలేకపోతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

**నివారణకు ప్రత్యేక చర్యలు..**

జిల్లాలో హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించిన కుత్బుల్లాపూర్, ఉప్పల్, శ్రీరంగవరం, బాలానగర్, మల్కాజిగిరి, కీసర పీహెచ్‌సీల పరిధిలో ఫాగింగ్ యంత్రాల ద్వారా పొగ వెదజల్లటంతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను వైద్యశాఖ నిర్వహిస్తోంది. ఆరోగ్య శిబిరాలతో పాటు రక్త నమూనాల సేకరణ, దోమల నియంత్రణ మందులు చల్లడం వంటివి చేస్తున్నట్లు పేర్కొంటోంది. పురపాలక సంఘాలు, గ్రామాలు, వాటి పరిసరాల్లో నిత్యం ఫాగింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు దోమ తెరలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

**ర్యాపిడ్ యాక్షన్ బృందాలు**

మూడు స్థాయిల్లో ర్యాపిడ్ యాక్షన్ బృందాలపై జిల్లా వైద్యారోగ్యశాఖ దృష్టి సారిస్తోంది. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులు నిర్ధారణ సమాచారం తెలిసిన వెంటనే క్షేత్రస్థాయికి ఈ బృందాలు వెళ్తాయి. జిల్లా, డివిజన్, పీహెచ్‌సీ స్థాయిల్లో బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయిలో సహాయ మలేరియా అధికారి, హెల్త్ సూపర్‌వైజర్, హెల్త్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, పిచికారి పర్యవేక్షణకు ఒకరు ఉంటారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఎంహెచ్, సబ్ యూనిట్ అధికారి, ముగ్గురు హెల్త్ అసిస్టెంట్లను నియమిస్తారు. పీహెచ్‌సీ స్థాయిలో వైద్యాధికారి, కమ్యూనిటీ హెల్త్ అధికారి, పంచాయతీ కార్యదర్శి, హెల్త్ సూపర్‌వైజర్లు సేవలు అందిస్తారు.

**అప్రమత్తంగా ఉన్నాం..**

జూమ్ యాప్ ద్వారా సిబ్బంది, వైద్యులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం.. వ్యాధుల నియంత్రణకు ర్యాపిడ్ యాక్షన్ టీమ్‌లను సిద్ధం చేశాం. ప్రజలకు దోమల నివారణపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధులు ప్రబలకుండా కృషి చేస్తున్నాం. పీహెచ్‌సీల్లో ఆయా వ్యాధులకు సంబంధించి మందులను అందుబాటులో ఉంచాం.

– డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

### శాకంబరి అలంకరణలో..



కీసర: ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శ్రీభవానీ శివదుర్గ అమ్మవారు శాకంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లోకం ఆకలి బాధలు తొలగిపోయి అందరికీ ఆహారం, లభించాలన్న సంకల్పంతో అమ్మవారికి శాకంబరిదేవి అలంకరణ చేపట్టినట్లు ఆలయ వేదపండితులు తెలిపారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, ఈఓ నాగేందర్, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

### సీఎంఆర్‌లో సినీ నటుడు నవీన్ సందడి



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ గ్రూప్స్ కళాశాలలో శుక్రవారం సినీ హీరో నవీన్ పొలిశెట్టి సందడి చేశారు. పొలిశెట్టి నటిస్తున్న నూతన చిత్రం మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ప్రమోషన్స్‌లో భాగంగా సీఎంఆర్ గ్రూప్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినిమాలోని లేడీ లక్ సాంగ్ ప్రోమో రిలీజ్ చేశారు. విద్యార్థినులతో కలిసి స్టెప్పులు వేశారు. సీఎంఆర్ గ్రూప్స్ సీఈఓ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలు మరువలేనివి

**బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి**



అమరవీరుల స్థూపం వద్ద నాయకులతో మహేందర్‌రెడ్డి

మేడ్చల్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి మలిదశ ఉద్యమాల్లో తెలంగాణ అమరవీరులు చేసిన త్యాగాలను రాష్ట్ర ప్రజలు ఏనాడూ మరువలేరని బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మూడవ వార్డులో నిర్మిస్తున్న అమరవీరుల స్థూపం నిర్మాణ పనులను మున్సిపల్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమంలో ఎందరో వీరులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటాలు చేసి అమరులయ్యారని, వారి త్యాగాలు, ఆకాంక్షలను బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చే దిశగా బంగారు తెలంగాణ కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అమరులు, ఉద్యమకారులు వారి ఆశయ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు జాకట దేవరాజు, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, హరికృష్ణయాదవ్, గణేష్, మహేష్, సాయికుమార్, కోఆప్షన్ సభ్యులు నవీన్‌రెడ్డి, మహబూబ్‌అలీ, నాయకులు వీరభద్రారెడ్డి, ప్రవీణ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కీసర: మహిళల కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డీడీఎం సురభి, కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కరీంగూడలో నాబార్డ్ వారి సహకారంతో అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 15 రోజుల వెల్త్ ఫ్రమ్ వేస్ట్ శిక్షణ కార్యక్రమం ముగిసింది. మహిళలు స్వయం ఉపాధిరంగంలో రాణించేందుకు బ్యాంకులు అమలు చేస్తున్న రుణాలకు సంబంధించి అవగాహన కల్పించారు. లబ్ధిదారులు గ్రూప్‌గా ఏర్పడి ముందుకెళ్లాలన్నారు. సర్పంచ్ కొకట్ల గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ మాధవరెడ్డి, అభయసంస్థ ప్రెసిడెంట్ ధీరం ఉష, కోఆర్డినేటర్ సుచిత్రరెడ్డి, ట్రైనర్ అలివేణి, షకీలా ఉన్నారు.

### మోదీ దిష్టిబొమ్మ దహనం

శామీర్‌పేట్: బీజేపీ నేతృత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు బనాయిస్తూ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయించేందుకు కుట్ర చేస్తోందని కాంగ్రెస్ తూంకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలకు నిరసనగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం తూంకుంటలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. శామీర్‌పేట మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు మురళీగౌడ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు హరిగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి భిక్షపతి తదితరులు ఉన్నారు.

### బస్సు ఢీకొని పాదచారి మృతి

శామీర్‌పేట్: పాదచారిని బస్సు ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం యాడారం గ్రామానికి చెందిన మల్లేష్(55), తుర్కపల్లి వైపు కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తున్నాడు. గోదావరిఖని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పెద్దపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తూ మల్లేష్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

### ఉత్తమ సేవలకు అవార్డులు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాల విద్యార్థులు గడిచిన ఏడాదిలో రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాలు, సేవలకు అవార్డులు వరించాయి. కళాశాల విద్యార్థుల రక్తదానం చేపట్టినందుకు ఉత్తమ క్లబ్ అవార్డు, ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని మరమ్మతులు చేయించి విద్యార్థుల సమస్యలు తీర్చడంతో డీఆర్ఆర్ ఎక్సలెన్స్ అవార్డుతో పాటు విద్యార్థులు సందీప్ కోట, సాయిభార్గవ్‌కు అవార్డులతో పాటు కళాశాలకు పలు అవార్డులు దక్కాయి. రోటరాక్ డిస్ట్రిక్ క్లబ్ నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ విద్యార్థులను కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అభినందించారు. ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ సరోజా రెడ్డి, అనురాగ్‌రెడ్డి, క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

### మదర్‌థెరిసాలో జాబ్‌మేళా

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లోని మదర్ థెరిసా ఫార్మసీ కళాశాలలో హెటిరో డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. పలు కళాశాలకు చెందిన 213 మంది విద్యార్థులకు పాల్గొనగా 56 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ప్రాథమిక రాత పరీక్ష, సాంకేతిక, వ్యక్తిత్వ తదితర మూడు విడతల్లో అభ్యర్థులను పరిశీలించి ఎంపిక చేశారు. కళాశాల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, కార్యదర్శి సోమశేఖర్, ఫార్మసీ విభాగ ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ రాంచందర్, ప్లేస్‌మెంట్ అధికారి రూహి, సంస్థ ప్రతినిధులు, పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి భారీగా నిధులు



ఘట్‌కేసర్‌లో శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, చైర్ పర్సన్ పావనీయాదవ్



రాంపల్లిలో కనకదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి మల్లారెడ్డి

**మంత్రి మల్లారెడ్డి**

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 4, 11, 13, 14 వార్డులో రూ.80 లక్షల నిధులతో నిర్మిస్తున్న వైకుంఠధామం ప్రహరీ, సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులకు చైర్ పర్సన్ పావనీయాదవ్‌తో కలిసి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే నేషనల్ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(ఎన్ఏసీ) ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 30 మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, రైతు బంధు మండల కోఆర్డినేటర్ అంజిరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులు, అనురాధ, మల్లేశ్, జహంగీర్, వసంత, నర్సింగ్‌రావు, రవీందర్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు షౌకత్, అరుణ, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

**ప్రజల రుణం తీర్చుకుంటా**

ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ప్రతాపసింగారంలో మంత్రి మల్లారెడ్డి సొంత నిధులతో పలు అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కంత మహేశ్వర ఆలయం, మజీద్, యూత్ భవనం పనులకు భూమి పూజ చేశారు.

**కనకదుర్గాదేవి అమ్మవారి సేవలో..**

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి ఓయూ కాలనీలోగల కనకదుర్గాదేవి దేవాలయం 8వ వార్షికోత్సవ ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో భాగంగా దేవాలయంలో కొలువైన అమ్మవారిని శుక్రవారం మంత్రి మల్లారెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారి దయతో ప్రజలకు శుభం కలగాలని, రాష్ట్ర ప్రజలంగా సంతోషంగా జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, నేతలు ఆంజనేయులుగౌడ్, సాయినాథ్‌గౌడ్, నాగేందర్, దయాకర్‌రావు తదితరులుపాల్గొన్నారు.

### అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి



నర్సింగ్‌రావు (ఫైల్)

కీసర: సొంత ఆటోలో ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతిచెందిన ఘటన శుక్రవారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. కీసర సీఐ వెంకటయ్య, స్థానికుల వివరాల ప్రకారం.. కీసరలోని సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న శ్రీరామలింగేశ్వరకాలనీలో ఇళ్ల మధ్య నిలిపి ఉన్న ఆటో ట్రాలీ నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గమనించారు. ఆటో ముందు డ్రైవింగ్‌సీటులో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు జవహర్‌నగర్ బాలాజీనగర్‌కు చెందిన పిట్టల నర్సింగ్‌రావు(45)గా గుర్తించారు. నెలల క్రితం బతుకుదెరువు నిమిత్తం భార్య, ముగ్గురు పిల్లలతో వచ్చి కీసరలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని జీవనం వెళ్లదీస్తున్నాడు. ఆటో ట్రాలీలో కూరగాయలు, పండ్లు తెచ్చి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. నాలుగు రోజుల క్రితం ఇంట్లో గొడవ పడి ఆటో తీసుకొని తిరిగి ఇంటికి వెళ్లలేదు. కీసరలోని సినిమా థియేటర్ ఎదురుగా ఆటోలో అతడి మృతదేహం లభించడంతో కుటుంబీకులు బోరున విలపించారు. మృతుడు మద్యం మత్తులో ముందు సీట్లో బోర్లపడి అందులో ఇరుక్కుపోయి ఊపిరి ఆడక మృతి చెంది ఉంటాడా లేక ఇంట్లో గొడవపడి వచ్చిన అతను ఆత్మహత్య చేసుకున్నాడా.. అని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సొమ్ము ఒకరిది.. సోకు సర్పంచ్‌ది

- గౌడవెల్లి సర్పంచ్ సురేందర్‌పై పలువురి ఆగ్రహం
- ఏకపక్ష వ్యవహార శైలి అంటూ ఆరోపణలు
- అందరినీ కలుపుకొని పోవాలని సూచనలు

మేడ్చల్: సొమ్ము ఒకరిది సోకు సర్పంచ్‌దిగా గౌడవెల్లి సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ వ్యవహార శైలి ఉందని గ్రామ మాజీ సర్పంచ్ మాధవి రాజు, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాజు అన్నారు. గ్రామంలో మోడల్ అంగన్‌వాడీ భవనం నిర్మాణం కోసం గ్రామ పరిధిలో ఉన్న హెచ్‌ఎం క్లూస్ సీడ్స్ కంపెనీ వారు రూ.18 లక్షలను విరాళంగా ఇచ్చారని, అందులోంచి అంగన్‌వాడీ భవనానికి దాతల సొమ్ముతో పాటు గ్రామ పంచాయతీ నుంచి రూ.10 లక్షలు వెచ్చించి గ్రామ పంచాయతీ స్థలంలో నిర్మించారని అన్నారు. ప్రభుత్వ సొమ్ము, దాతల సొమ్ముతో గ్రామ పంచాయతీ స్థలంలో భవనం నిర్మించి భవన ప్రారంభోత్సవంలో కనీసం ప్రొటోకాల్ పాటించలేదని అన్నారు. మంత్రి మల్లారెడ్డిని ఆహ్వానించకుండా, ఎంపీపీ, జెడ్పీటీసీలకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా నిర్వహించారని విమర్శించారు. జెడ్పీ కాంగ్రెస్ లీడర్ హరివర్ధన్‌రెడ్డితో ప్రారంభించి మండల ప్రజాప్రతినిధులను సర్పంచ్ సురేందర్ అవమానించారని అన్నారు. మంత్రి మల్లారెడ్డిని గ్రామానికి పిలిచి ఆయనతో భవనాన్ని ప్రారంభిస్తే మరిన్ని నిధులు కోరే అవకాశం ఉండేదని అన్నారు. సర్పంచ్ సురేందర్ ఏకపక్ష వ్యవహార శైలితో అధికార పార్టీ మంత్రితో, నాయకులతో మాట్లకుండా వ్యవహరిస్తూ గ్రామ అభివృద్ధిని కుంటుపరుస్తున్నారని అన్నారు. అందరినీ కలుపుకు పోయి గ్రామాన్ని అభివృద్ధి దిశలో నడిపించాలని సూచించారు.

## రైల్వే వంతెన పనుల అలసత్వంపై అఖిలపక్ష సమావేశం



మాట్లాడుతున్న యాదగిరియాదవ్

ఘట్‌కేసర్: దశాబ్ద కాలంగా కొనసాగుతున్న ఘట్‌కేసర్ రైల్వే వంతెన పనుల అలసత్వంపై పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాల్లో మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంతెన కోసం చేపట్టనున్న ఉద్యమ తీరును చర్చించారు. తెలంగాణ ఉద్యమంలా రోజుకో పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టాలని, మరోసారి ముఖ్య నాయకులు సమావేశమై దీక్ష తేదీ ప్రకటిస్తామన్నారు. అధికార పార్టీ నాయకుల నిర్లక్ష్యం వల్లనే వంతెన ఆలస్యం అవుతోందని, పార్టీని పక్కన పెట్టి ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. అఖిలపక్ష సమావేశంలో మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, కాంగ్రెస్ నాయకులు బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ముత్యాలుయాదవ్, ఆంజనేయులు, సంజీవరెడ్డి, బీజేపీ నాయకులు మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీపీఎం నేతలు యాదయ్య, సబిత, సీపీఐ నేతలు జయచంద్ర, ఈశ్వర్, టీడీపీ మండల అధ్యక్షుడు సంజీవగౌడ్, బీఎస్పీ నేత పద్మారావు, టీజేఎస్ నాయకుడు లక్ష్మారెడ్డి, దేవేందర్‌ముదిరాజ్, రాధాకృష్ణముదిరాజ్, భూషణం, ఆంజనేయులు, శశిధర్, లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, సురేశ్, గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.